# మలయమారుతం

–గ్లాస్గోపంచె...జరీనంబరు పాదంమీదపరచుకునేట్టుగా...అంచు పద్మాగ్రంలాగా అమరికగా బంగాళీకట్టూ, అల్లిక బనియన్...ఉల్లిపొర...గీరలలాల్చీ...పక్కజేబులో ఘుమాయించే జేబురుమాలు...పైజేబులో, అకారం, అంకెలూ, చూచాయగా కనబడుతూ, పదిరూపాయల నోట్ల బొత్తి...బుగ్గను రూపాయకిళ్ళీ...

...అనుకున్న ప్రకారం వేళకుసరిగా...ఆ గుమ్మం ఎక్కాడు...సత్యం...

తలుపు ఓరవాకిలిగా ఉన్నది: చెప్పుల చప్పుడు విని...లోపలినుంచి "వచ్చె...వచ్చె..." అనుకుంటూ...ఆ అమ్మాయి తల్లి...హాలులో దీపం పెద్దదిచేసి, తలుపు తీసి "రా నాయనా" అని పలుకరించి, గుమ్మంలోకి వచ్చి, వీధి అటూ ఇటూ తొంగిచూసి వెనుకనుంచి, తలుపు వేసింది...

..."కూర్చోండి అలా నిలుచుంటారే: ఇప్పుడే...యిందాకటినుంచీ మీరు వస్తారుకదా అని యిక్కడే కూర్చుని... ఇట్టేలోపలికి వెళ్లాను పాలల్లో తోడు వేసి వద్దామని...మీరూ రానే వచ్చారు...అమ్మాయీ!...వారు వచ్చారే..."

చంద్రం...అవతల వసారాలోంచి...ఆ పక్కగదిలోకి వెళుతూ తన వేపుచూసి ఒక్కమారు తళుక్కుమన్నది: సత్యం... జేబులోనుంచి పైకంతీసి, ముసలిదానికి యివ్వబోయినాడు.

"నాకెందుకు బాబూ! మీవంటివారు మా యింటికి రావడం...అమ్మాయి అదృష్టముకొద్దీ–అదే నాకు పదివేలు...ఇక మీ యిష్టం...మీ యిష్టం...యిచ్చుకోండి, మానుకోండి. నేనల్లాచూసి సంతోషించడమే..." అని...లోపలికి చక్కాబోయింది.

చంద్రం ఏ గదిలోకి వెళ్ళిందో...సత్యం...అందులోనే ప్రవేశించాడు...కలకలలాడుతూ ఉంది...

లేచి నిలుచుని...సోఫామీద నుంచి...నవ్వుతూ...కనులతో పలుకరించింది...చొరవగా చేజాపి పట్టుకోబోయినాడు... కొంటెగా తప్పించుకుని తలుపువేపు తల విసిరింది. వెళ్ళి గడియవేశాడు...

"ఇదుగో ... ఇంద –" జేబులోనుంచి...నోట్లు బయటకు తీస్తున్నాడు. చంద్రం కోపంగా..."డబ్బు...మీరే ఎరుగున్నారు: మే మెన్నడూ డబ్బు మొగమే చూడలేదు...ఆ బల్లమీద పారేయండి..."

జవాబు చెప్పకుండా...అయిదునోట్లూ – ఆమెకు కనబడేలాగున విడబరచి లెక్కపెట్టినట్లు నటించి, మళ్ళా బొత్తిచేసి... బల్లమీద పొందాను...ఎత్తుపెట్టాడు...

"కూర్చోండి..."

"నీవుకూడా...ఇక్కడ..."

"మీకు ఎదురుగా...ఇక్కడ."

"ఊహుఁ...ఇక్కడ నాపక్కను."

"అమ్మో...ఆశే...మీరు మంచి పిల్లవాళ్లు కారు."

సత్యానికి...యీ చెలగాటం అదో సరదాగా ఉంది: ఖరీదు యిచ్చి కొనుక్కున్నా.. అమాట అని రసాభాసం చేసుకోవడంకంటె...యిదీ బాగానేవుంది...కొత్తగా సంసార పక్షంగా...

"వీణ...వాయించనా..."

– అక్కరలేదు...అని తల ఊగించాడు...చంద్రం త్రాచులాగా లేచింది..."మీరేం సరసులు...మొక్కు తీర్చుకోడమైతే...యిక్కడకు రావడం దేనికి...యింటి దగ్గరనే...పడి వుంటే...యీపాటికి పక్కంతా చెల్లాచెదురూ చేసుకుని...యిల్లాలూ మీరూ నిదురపోతూ వుండేవారుగా...యిందుకోసం...యీ ఖర్చంతాఎందుకు...యింతే ఈ కాలంవాళ్ళు...కొనుక్కుందామని వుబలాటమే కాని...తీరా అక్కడకు వచ్చేటప్పటికి...అనుభవించడం చేతకాదు..."

"పోనీలే...వింటాను...".

"ఏం...నన్ను ఉద్ధరించడానికా?... నా పాట వినడానికి యింతకన్న ఎవరూదొరక రనా...చెప్పకండి...యిదేం బలవంతం బ్రాహ్మణార్థంకాదు...సరసాలేమీ నేరవకుండా...అందు కోసమే వచ్చానంటే...నేను కాదనను...మిమ్మల్ని ఎంతో ఒప్పించాలని...మల్లె మొగ్గల వంకీజడ వేయించుకున్నాను...పాము కుబుసంలాంటి వుప్పాడచీరె...మొగలి చాయ రవిక...యిదిగో యీప్రక్కనుండి పండువెన్నెల...మీరు చక్కగా...నవమన్మథులులాగా నాచేత గంధం పూయించుకుని, పన్నీరు చల్లించుకుని...హాయిగా... నేను మీ యెదుట కూర్చుని వీణె వాయించినతర్వాత... అమీద...నామీద ప్రేమతో...ఎంతో అనుకున్నాను...మీరు వస్తామని కబురుపంపినప్పటినుంచి మిమ్మల్ని మెప్పించడానికి. ..ఎన్నో ఊహించాను. పోనీండి...మీకు అవన్నీ వెగటైే...అదొక్కటే, అవసరమైతే... ఎన్ని కోరికలున్నా...ఎప్పుడూ మా బ్రతుకింతేకదా...మాకు దొరికేవారు...ఎన్నడూ యీపాటివారేకదా అని...ఒక్క నిట్టూర్పు విడిచి ఊరుకుంటాను...చెప్పండి...మీకు మొగమాటమెందుకు?..."

"–నేనంత పశువును కాను...నిన్ను చూడగానే...మనసు నిలుపలేకపోయినాను కాని...నొప్పించాలని కాదు... నాకూ హృదయం ఉన్నది...అనుభవించాలనే కోరిక ఉన్నది...అందుకనే నిన్ను వెదుక్కుంటూ వచ్చింది..."

"అంత ధర పెట్టింది"

"అమాట అనకు...నాకు చిన్నతనం వేస్తుంది...తలవంచుకోవలసివస్తుంది...అన్నీ కొనగలమా...ఐశ్వర్యము ఎంత ఉండనీ...అందులోనూ, నిన్ను..."

"–ఎంతవారండీ...నా మనస్సు కనుక్కోవాలని వేసిన పన్నాగమా యిదిఅంతా... నాకూ తెలియక కాదులెండి...చూడగానే పోల్చుకున్నాను. అయినా, ఏదారికి వస్తారో అని...అమ్మదొంగా..."

– సత్యం కొంచెం యిరకాటంలోనే పడ్డాడు.

గడియారంముళ్ళు రెక్కలుకట్టుకున్నంత వేగంతో... కాలాన్ని గిరగిర లాడించు తున్నవి: బింకానికిపోయి...పెద్దచిక్కు తెచ్చిపెట్టుకున్నాడు...ప్రొద్దు చాలా పోయింది...సంగీతం గింగీతం యిప్పుడు వద్దులే...అంటే చంద్రం అతిచులకనగా చూస్తుంది. సాని కూతురి ఎన్నికలో అంత వాసి చెడటం...ఎంతమాత్రమూ పరువైన పనికాదు...కాదు కూడదు...అంటే ఒప్పుకోక ఏం చేస్తుంది. కాని...అఖరికి...ఆ అమ్మాయి తనను అసహ్యంచుకోవడమా?...

ఎన్ని కప్పుల టీ త్రావినా...అందుకోసం పవలంతా నిద్రపోయినా...వేసుకున్న కిల్లీ పూరాగా వేడిచేసి... మత్తుగా, తమాషాగా...ఎలాగో ఉంది ఒంట్లో...అయినా...ముందు, ఒకసారి ముద్దిడుకోనిచ్చినా... ఊహూ...చంద్రందగ్గరకే రాందే...

"ఒప్పుకున్నాను కాని...ఒక్క ముద్దు..." అని రాబోయే నిదురను బలవంతాన బిగబట్టి...పసివాడిలాగా బ్రతిమాలుతూ అడిగాడు...

"ఊ...ఇప్పుడా?...మెప్పుకు...అనక ఆ బహుమానాలు!"...అనినవ్వుతూ...తివాచీమీద కూర్చుని...చంద్రం వీణె సారించింది.

– చల్లని...గాలి...ఒళ్ళు మరిపించే...పాట!

– తెల్లవారి...ఒంటరిగా మేలుకున్న తరువాత...అనుకుని ఉస్సూరుమన్నాడు... అప్పుడు అల్లా కూర్చున్న చోటనే నిదురపోయినానుకదా అని...అనుకుని మాత్రం ఏంలాభం...కోపం అంతా ఎదురుగుండా గవిసెనలేని వీణ మీద చూపించాడు... ఒకటి రెండు తీగెలు పుటుక్కుమనిపించి...వంచినతల ఎత్తకుండా...మంచులో తడిసిన మల్లెపువ్వులాగా...చెక్కుచెదరకుండా...యింటికి వచ్చి ... మంచంమీద నిదురకు వ్రాలాడు.

★ ★ ★